క్లుప్తంగా

నేటి నుంచి ఇంటర్ అడ్మిషన్లు

పెద్దశంకరంపేట(మెదక్): స్థానిక మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియేట్‌లో ప్రవేశానికి అడ్మిషన్లు సోమవారం నుంచి ప్రారంభం కానున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీలత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్‌లో చేరే విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఆయా తరగతుల్లో 40 సీట్ల చొప్పున ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జక్కపల్లి మోడల్ స్కూల్

నర్సాపూర్ రూరల్: నేటి నుంచి మండల పరిధిలోని జక్కపల్లి మోడల్ స్కూల్ ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఫర్హాన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతిలో ఉత్తీర్ణత సాధించి మోడల్ స్కూల్‌లో ఇంటర్ చదవాలని ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్

అల్లాదుర్గం(మెదక్): మండల పరిధిలోని గొల్లకుంట తండాలో జగదాంబ మాత, సేవాలాల్ మహరాజ్ విగ్రహాలను ఆదివారం ఘనంగా ప్రతిష్ఠించారు. రెండు రోజులుగా వేదపండితులు పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, భిక్షపతి, కాశీనాథ్, దుర్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి రూ. 25 వేల విరాళం

అల్లాదుర్గం(మెదక్): మండల పరిధిలోని గొల్లకుంట తండాలో నూతనంగా నిర్మించి, జగదాంబమాత విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఆదివారం ఆలయాన్ని దర్శించుకున్న రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ భిక్షపతి, ఆలయానికి రూ.25 వేలు విరాళం అందజేశారు. ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నర్సింలు. దశరథ్, శివరాం, మోహన్‌రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

టేక్మాల్(మెదక్): మండలంలోని ధన్నూరలో రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలకు రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం భిక్షపతి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ అభివృద్ధి కోసం రూ. 25 వేల విరాళం అందజేశారు.

కార్మికుల భారీ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

రామాయంపేట(మెదక్): సీఐటీయూ జిల్లా మహాసభ సందర్భంగా ఆదివారం రామాయంపేటలో కార్మికులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు, జిల్లా ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు.

సిద్దేశ్వరాలయంలో పూజలు



హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని ముత్తాయికోట సిద్దేశ్వరాలయంలో కోటిరుద్రశ్రీసూక్త పారాయణంను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొగిట పీఠాధిపతి మాధవానంద స్వామి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 333 కిలోల పండ్ల రసంతో అభిషేకం, మహాలంకరణ పూజలను ఆలయ పూజారీ గోవింద్ మహరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే పద్మ, మైనంపల్లి హన్మంతరావు, ఎమ్మెల్సీ సుభాశ్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సాగుపై రైతులకు అవగాహన

వ్యవసాయ శాఖ ఏడీ సంధ్యారాణి



నర్సాపూర్ రూరల్: సీనియర్ వ్యవసాయ శాస్త్రవేత్తలతో సోమవారం నుంచి ఈనెల 13 వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నర్సాపూర్ వ్యవసాయ శాఖ ఏడీ సంధ్యారాణి ఆదివారం సాయంత్రం తెలిపారు. రైతుల ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం పేరుతో నేడు సోమవారం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం సీనియర్ శాస్త్రవేత్తలు, అధికారులు మండలంలోని పెద్ద చింతకుంట పంచాయతీ ఆవరణలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

నల్లపోచమ్మదేవికి ప్రత్యేక పూజలు



తునికి నల్లపోచమ్మదేవికి పూజల చేస్తున్న భక్తులు

మండలంలోని తునికి నల్లపోచమ్మ దేవి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం దేవాదాయశాఖ ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌స్పెక్టర్, ఆలయ ఇన్‌చార్జి ఈఓ రంగారావు ఆధ్వర్యంలో అర్చకులు శివ్వప్ప, రాజేష్, విఘ్నేష్ అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం భక్తులు బోనాలు తీసి ఒడిబియ్యం పోసి కుంకుమార్చనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. పలువురు భక్తులు అమ్మవారికి తలనీలాలు సమర్పించి వాహనాలకు పూజలు చేయించారు. ఆలయ జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, ఆలయ సిబ్బంది భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

– కౌడిపల్లి(నర్సాపూర్)

చాముండేశ్వరికి కుంకుమార్చన

చాముండేశ్వరి అమ్మవారిని ఆదివారం భక్తులు దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి ప్రదక్షిణలు, ఓడిబియ్యంతో మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అమ్మవారి ప్రసాదాన్ని భక్తులకు వితరణ చేశారు.

– చిలప్‌చెడ్(నర్సాపూర్)



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అసంపూర్తిగా బీటీ రోడ్డు

- ఏడాదిగా నిలిచిన పనులు
- కంకర వేసి వదిలేసిన కాంట్రాక్టర్
- ఇబ్బంది పడుతున్న ప్రజలు



సలాబత్‌పూర్‌కు వెళ్లేదారిలో అసంపూర్తిగా రోడ్డు

కౌడిపల్లి(నర్సాపూర్): దేవుడు కరుణించినా పూజారి కనికరించలేదు అన్న చందంగా మారింది ఆ గ్రామ పంచాయతీల పరిస్థితి. రోడ్డు ధ్వంసమై గుంతలుపడగా గత ప్రభుత్వం మరమ్మతులకు నిధులు మంజూరు చేసింది. కాంట్రాక్టర్ పనులను అసంపూర్తిగా వదిలేయడంతో ప్రజలు మరింత కష్టాలు పడుతున్నారు. ఇది కౌడిపల్లి మండలం అంతారం సలాబత్‌పూర్ రోడ్డు దుస్థితి.

కౌడిపల్లి మండలం అంతారంగేట్ నుంచి సలాబత్‌పూర్, మర్రిచెట్టుతండా, కొత్తపల్లి, రహీంగూడ మీదుగా చిలప్‌చెడ్ మండలం సోమక్కపేట గేట్ వరకు వివిధ తండాలను కలుపుతూ రింగు రోడ్డు ఉంది. ఇక్కడ గతంలో వేసిన బీటీ రోడ్డు, మెటల్‌రోడ్డు పూర్తిగా ధ్వంసం అయి గుంతలు పడటంతో అప్పటి ఎమ్మెల్యే మదన్‌రెడ్డి తిరిగి బీటీ (రిబీటీ) రోడ్డు వేసేందుకు గాను రూ. 2.15 కోట్లు మంజూరు చేయించారు. అయిదు కిలోమీటర్ల మేర రిబీటీగా చేయాల్సి ఉంది. అయితే గతేడాది పనులు చేపట్టిన కాంట్రాక్టర్ ధ్వంసమైన బీటీని మొత్తం తొలగించి కంకర వేశారు. రోడ్డుపక్కన మట్టివేసే పనులు పూర్తి చేశాడు. పనులు త్వరగా పూర్తయితే సమస్యలు తీరుతాయని ప్రజలు భావించారు. కాగా కంకరవేసిన అనంతరం కాంట్రాక్టర్ పనులను అసంపూర్తిగా వదిలేశాడు. దాదాపు 14 నెలలు కావొస్తుంది. కంకరరోడ్డుపైనే వాహనదారులు, ప్రజలు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు వెళ్లినప్పుడు దుమ్ములేవడంతో ఇబ్బంది పడతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ప్రభుత్వం స్పందించి రోడ్డు పనులు పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



రోడ్డు మరమ్మతు పనులను అసంపూర్తిగా వదిలేయడంతో సమస్యగా ఉంది. కాంట్రాక్టర్ కంకరవేసి వదిలేశాడు. అయిదు గ్రామ పంచాయితీల ప్రజలకు అవస్థలు తప్పడంలేదు. కంకరవేసిన రోడ్డుపై వాహనాలు వెళ్లేటప్పుడు దుమ్ముతో ఇబ్బంది పడుతున్నాం అధికారులు స్పందించి పనులు త్వరగా పూర్తిచేయాలి.

– ప్రవీణ్‌రెడ్డి, సలాబత్‌పూర్

త్వరలో పూర్తి చేస్తాం

అంతారంగేట్ నుంచి సోమక్కపేట గేట్ వరకు అయిదు కిలోమీటర్ల వరకు రిబీటీ పనులు జరుగుతున్నాయి. కంకరవేసిన తరవాత పనులు ఆగిపోయాయి. కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

– అమరేశ్వర్, పీఆర్‌డిప్యూటీ ఈఈ, కౌడిపల్లి

ఎంఎన్ కెనాల్ రైతుల కల సాకారం

- సాగునీటి సరఫరాతో చేతికి వచ్చిన పంట
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు



ధాన్యాన్ని ట్రాక్టర్‌లో పోస్తున్న వరికోత యంత్రం

హవేళిఘణాపూర్(మెదక్): ఎంఎన్ కెనాల్ కింద పొలాలు ఉన్న రైతుల కల సాకారమైంది. మండల పరిధిలోని ముత్తాయికోటతోపాటు ఆయా గ్రామ శివారులోని పొలాలకు ఎంఎన్ కెనాల్ ద్వారా సాగునీటిని సరఫరా చేయడంతో రైతులు సాగుచేసిన పంటలు చేతికందాయి. ఇరిగేషన్ అధికారులు ఘణాపూర్ ఆయకట్టు నుంచి విడతల వారీగా సాగునీరు సరఫరా చేశారు. దీంతో శివారు జక్కన్నపేట, పోచమ్మరాశ్ వరకు ఉన్న పొలాలకు కూడా నీరందింది. మండల పరిధిలోని మద్దుల్‌వాయి, కూచనపల్లి, ముత్తాయిపల్లి, ఫరీద్‌పూర్, సర్దన, జక్కన్నపేట, పోచమ్మరాశ్ పరీవాహక శివారులో సైతం సాగునీటి కొరత లేకపోవడంతో రైతులు ఏ సమస్యాలేకుండా సాగుచేశారు. ఇప్పుడు కోతలు కోసి ధాన్యం ఆరబెట్టుకొంటున్నారు. అందుకు కృషిచేసిన అధికారులు, నాయకులకు రుణపడి ఉంటామని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా భగీరథ జయంతి



భగీరథ చిత్రపటానికి పూలమాల వేస్తున్న సభ్యులు

రామాయంపేట(మెదక్): రామాయంపేటలో సగర సంఘం ఆధ్వర్యంలో ఆదివారం భగీరథ జయంతి నిర్వహించారు. ఉదయం చిత్తారమ్మ ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్, వివేకానంద సర్కిల్, సిద్దిపేట రోడ్డు మార్గంలో ర్యాలీ కొనసాగింది. ఈసందర్భంగా సంఘం సభ్యులు భగీరథ విగ్రహం ఏర్పాటు కోసం భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. సగర సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మర్కు నగేశ్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మర్కు దత్తు, జిల్లా ఉపాధ్యక్షుడు సిద్ధరాంలు, సంయుక్త కార్యదర్శి బాల్‌రాజ్, సలహాదారుడు నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలతోనే మద్దతు ధర

మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ లక్ష్మి



చిల్వెర గ్రామంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

అల్లాదుర్గం(మెదక్): మండల పరిధిలోని చిల్వెర గ్రామంలో ఆదివారం వట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ లక్ష్మి, అల్లాదుర్గం పీఏసీఎస్ చైర్మన్ దుర్గారెడ్డి జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ లక్ష్మి మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర అందించేందుకే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుందన్నారు. ఈ కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ శివగౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్లు చెన్నప్ప, ప్రేమ్‌కుమార్, పుండరీకం, రమేశ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శేషారెడ్డి, నాయకులు యాదయ్య, శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పెద్దశంకరంపేటలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏఈఓ

సద్వినియోగం చేసుకోవాలి

పెద్దశంకరంపేట(మెదక్): ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఈఓ వినీత్ సూచించారు. పెద్దశంకరంపేటలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన జొన్న, వరిధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం తేమను పరిశీలించి రైతులకు పలు సూచనలిచ్చారు. రైతులు దళారులను ఆశ్రయించవద్దని, కొనుగోలు కేంద్రాలలో విక్రయించి మద్దతు ధర పొందాలని చెప్పారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ రవీందర్ పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ

దేవత విగ్రహం, ఆభరణాలు అపహరణ

శివ్వంపేట: గుర్తు తెలియని దుండగులు రేణుక ఎల్లమ్మ దేవాలయంలో చోరీకి పాల్పడిన ఘటన మండలంలోని మల్లుపల్లి గ్రామ శివారులో ఆదివారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. దొంతి గ్రామానికి చెందిన బుడిగ అంజనేయులు గౌడ్ వ్యవసాయ పొలంలో ఆరు నెలల కిందట రేణుక ఎల్లమ్మ దేవాలయం నిర్మించుకొని విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. ఆదివారం ఉదయం మల్లుపల్లి గ్రామానికి చెందిన కొందరు యువకులు దేవాలయంలో చోరీ జరిగినట్లు సమాచారం ఇవ్వడంతో వెళ్లి చూశారు. దేవాలయంలో అమ్మవారి విగ్రహంతోపాటు రూ.40 వేల నగదు, విలువైన బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్లు తెలిపారు. ఆంజనేయులు గౌడ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

తల్లికి తలకొరివి పెట్టిన కూతురు

చిన్నశంకరంపేట(మెదక్): అనారోగ్యంతో మృతి చెందిన తల్లికి కూతురు అంత్యక్రియలు నిర్వహించిన ఘటన చిన్నశంకరంపేట మండలం జంగరాయి గ్రామంలో చోటు చేసుకుంది. జంగరాయి గ్రామానికి చెందిన చౌటకూరు బాలమణి అనారోగ్యంతో గాంధీ అస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. బాలమణికి సుజాత ఒక్కతే కూతురు కావడంతో తల కొరవిపెట్టి అంత్యక్రియలు నిర్వించింది. కన్న కూతురు తల్లి అంత్యక్రియలు నిర్వహించడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు

గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి



బోరుబావి తవ్వకానికి శంకుస్థాపన చేస్తున్న నర్సారెడ్డి, కాంగ్రెస్ నాయకులు

తూప్రాన్: వేసవిలో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు చేపడుతున్నామని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మున్సిపాలిటీలోని 16వ వార్డులో నూతనంగా బోరుబావి తవ్వకానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మిషన్ భగీరథ నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తిన తరుణంలో బోరుబావుల ద్వారా ప్రజలకు నీటిని అందించేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. గజ్వేల్ నుంచి మూడు దఫాలుగా ఎమ్మెల్యేగా గెలిచిన కేసీఆర్ ఫాంహౌస్‌లో ఉండి ప్రజల ఇబ్బందులను ఎందుకు పరిష్కరించడం లేదని ప్రశ్నించారు. ప్రతి నెల వేతనం తీసుకుంటున్న ప్రజల అవసరాలు పట్టవా..? అని ఎద్దేవా చేశారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గణేశ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కృష్ణ, రవీందర్ గుప్త, నందాల శ్రీనివాస్, భగవన్‌రెడ్డి, విశ్వరాజ్, ఉమర్, సిద్దిరాములుగౌడ్, దీపక్‌రెడ్డి, నారాయణ గుప్త, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సినిమా పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే



పోస్టర్ ఆవిష్కరిస్తున్న హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: శ్రీక్రియేషన్స్ బ్యానర్‌పై రూపొందుతున్న ఓ సినిమా పోస్టర్‌ను మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆదివారం ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో సినిమా నిర్మాత షరీఫ్, హీరో బాంబే శ్రీనివాస్, కథనాయిక హారికలతో కలసి పోస్టర్ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం షూటింగ్ కొనసాగుతున్న ఈ సినిమా ప్రేక్షకుల ఆదరణ పొందాలని ఆకాంక్షించారు.

కట్టు కాల్వను పరిశీలించిన ఎమ్మెల్యే



కాల్వను పరిశీలిస్తున్న కొత్త ప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని పెద్ద చెప్యాలలో అసంపూర్తిగా ఉన్న కట్టు కాల్వ పనులను దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. ఇరిగేషన్ అధికారులు, కాంట్రాక్టర్లతో మాట్లాడి కట్టు కాల్వ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు శివ, నాయకులు రవీందర్‌రెడ్డి, స్వామి, రాజేందర్, రైతులు ఉన్నారు.

జాబ్‌మేళాలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న అంబదాస్

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు తమలోని ప్రతిభను చాటుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రగతి, మంజీరా విద్యాసంస్థల కరస్పాండెంట్ అంబదాస్ ఆకాంక్షించారు. స్థానిక ప్రగతి ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన జాబ్‌మేళాలో ఎంపికైన ప్రగతి కళాశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులను ఆదివారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్యం దిశగా అడుగులు వేయాలన్నారు. ఉన్నత స్థానాల్లో నిలిచినపుడే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మట్టయ్య చౌదరి, ఎంఎస్ఎన్ ఫార్మా ప్రతినిధి శేఖర్, న్యూలాండ్ లాబొరేటరీ ప్రతినిధి మధుసూదన్ పాల్గొన్నారు.

ఇన్విటేషన్ కప్ విజేత సిద్దిపేట

ఫైనల్‌లో తమిళనాడుతో హోరాహోరీ



కప్ అందజేస్తున్న సిటిజన్ క్లబ్ ప్రతినిధులు

సిద్దిపేటజోన్: జిల్లా కేంద్రంలోని ఫుట్‌బాల్ మైదానంలో రెండు రోజులుగా జరుగుతున్న ఇన్విటేషన్ ఫుట్‌బాల్ కప్ పోటీల్లో సిద్దిపేట జట్టు గెలిచింది. అండర్14– తమిళనాడు, సిద్దిపేట ఫుట్‌బాల్ క్లబ్‌కు మధ్య ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో హోరాహోరీగా పోరాడిన సిద్దిపేట జట్టు విజేతగా నిలిచింది. 2–0 గోల్స్ తేడాతో తమిళనాడు జట్టును ఓడించింది. ఈ సందర్భంగా తమిళనాడు కోచ్ నూర్ బాషా మాట్లాడుతూ సిద్దిపేట మైదానం అంతర్జాతీయ పోటీలకు అనువుగా ఉందన్నారు. అనంతరం సిటిజన్ క్లబ్ అధ్యక్షుడు రమేశ్, జిల్లా క్రీడలశాఖ మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి నవాబ్ అక్బర్ విజేత జట్టుకు బహుమతులు అందజేశారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పెద్దశంకరంపేట(మెదక్): పూర్వ విద్యార్థుల సమావేశం



శివ్వంపేట: సమ్మేళనంలో పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు

పెద్దశంకరంపేట(మెదక్): పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1998–99లో పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాత రోజులను గుర్తు చేసుకున్నారు. ఆయా రంగాల్లో స్థిరపడిన వారిని ఘనంగా సన్మానించారు.

శివ్వంపేట: మండలంలోని కొంతాన్‌పల్లి ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2004–05 విద్యా సంవత్సరానికి చెందిన పదవ తరగతి విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సమీపంలోని వనం రిసార్ట్‌లో అందరు కలుసుకున్నారు. ఆనాటి ఉపాధ్యాయులకు సన్మానం చేసి మెమోంటోలు అందజేశారు. పాత జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, దుర్గారెడ్డి, రాజు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.